అందుకోలేని ఆతిథ్యం

రైలొచ్చి ఆ చిన్న స్టేషన్‌లో ఆగింది. అయిదు నిమిషాలకు తిరిగి బయల్దేరింది. తలమీది టోపీ సరిచేసుకుంటూ బయల్దేరుతున్న రైల్లోకి ఎక్కాడు టి. సి. అదే క్షణంలో, ఆ పెట్టెలోనుంచే బయటికి దూకాడొక యువకుడు.

కొందరు టిక్కెట్లిచ్చి బయటకు పోతున్నారు. మరికొందరు సామాన్లు లెక్కించుకుంటున్నారు. హఠాత్తుగా రైల్లోనుంచి దూకిన వ్యక్తి లాగూ జేబుల్లో చేతులు పెట్టుకుని, ప్లాట్‌ఫారం ఒక చివరినుంచి మరొక చివరికి రెండుసార్లు పచార్లు చేసి, ఒకచోట టక్కున ఆగాడు. అక్కడ రైల్వే వారు స్టేషన్ కాంపౌండుకని వేసిన కటకటాలలో రెండు చువ్వలు లేక మనిషి పట్టేటంత మార్గమేర్పడిఉంది. అతను అక్కడ నిలబడి చుట్టూ చూచి తన నెవరూ గమనించటంలేదని నిర్ధారణ చేసుకుని ఆమార్గంగుండా బయటకు నడిచాడు.

"ఒరే మబ్బన్నా! పోయి బండికట్టు. ఒరే, వెంకటేసు! సామాన్లు జాగ్రత్తగా బండిలో కెక్కించు. అమ్మా రాధా! రా, అందరూ బండి దిగినట్టేనా? మొత్తం పదమూడున్నర టిక్కట్లు. ఒరే, వెంకటేసూ! సామాన్లు జాగ్రత్త" అని హెచ్చరించి గేటువైపుకు నడిచారు రంగనాథంగారు. పరాకుగా నిలబడ్డ రాధ అప్రయత్నంగా వారిని అనుసరించింది.

* * *

పచ్చని తోరణాలతో, పట్టుకుచ్చులు జీరాడే వివాహవేదికతో, ముత్యాలు పేర్చినట్టున్న ముగ్గులతో, ముసిముసినవ్వులు ముఖాన చిందులాడే ముదితలతో ఆనందం వెల్లివిరిసింది ఆ ఇంట్లో. ఆరోజు రాత్రికి సత్యనారాయణ కుమారుడు రాజబాబుకు వివాహం. సత్యనారాయణ వీధిగుమ్మం ముందు రెండెడ్లబండి నిలబడటంచూచి, అక్కడికి నడిచాడు. బండిలో రంగనాథం, వారి కుటుంబం వగైరాలను చూచి, ఆనందంతో, "వారంరోజుల ముందు రమ్మంటే ఇప్పుడా రావటం" అన్నాడు.

"ఏం చెయ్యన్రా! మీ వదినగారు నన్ను కదల్నిస్తేనా?"

"మరే పాపం, అందుకే గావాల్ను వారంరోజుల్నించీ పోరుతుంటే ఈ రోజు బయల్దేరారుకదూ?" అంది రంగనాథంగారి భార్య సావిత్రమ్మ. క్షణకాలం నవ్వులు దొర్లాయి ఆ ప్రాంతమంతా. రంగనాథం గారు, సత్యనారాయణ పెదతండ్రి పినతండ్రి బిడ్డలు.

పెళ్లియిల్లు రకరకాల మనుష్యులతో, అల్లరి చేసే పిల్లలతో, కమ్మని వాసనలు వెదజల్లుతున్న అత్తరు, పన్నీర్లతో నిండిపోయింది. రండోళ్ళు, సన్నాయి మేళాలు చెవుల్ని చిల్లులుపరుస్తున్నాయి. వాటికి పెళ్ళిపెద్దల హెచ్చరికలతో కూడిన అరుపులు, చిన్నపిల్ల ఏడుపులు మిశ్రమమయ్యాయి.

రాజబాబును, "ఇక్కడకూర్చో" అని ఒకరు, "నువ్విక్కడున్నావా? నీకోసం అక్కడ చూస్తుంటే" అని ఇంకొకరు. "అరె, నువ్వింకా అట్లాగే ఉన్నావేం? అవతల పీటలమీద కూర్చునే వేళౌతుంటే" అని మరొకరు తొందరపెడుతున్నారు.

వసారామెట్లు దిగి, పందిట్లోకి వస్తుండగా ఒక యువకుడు వీధిగుమ్మం దాటివస్తూ, రాజబాబు నుద్దేశించి, "ఏమండీ!" అన్నాడు నెమ్మదిగా. రాజబాబు తలెత్తి అతన్నిచూచి, "నువ్వా....." అంటూ ఆగిపోయాడు. పల్చని శరీరం, లోతుకు పోయినకళ్ళు, మాసిన బట్టలు, అరిగిన చెప్పులూ గల ఆ వ్యక్తి "మురళి" అన్నాడు.

"మురళి......మురళి" ఆ మాటనే అంటూ చుట్టూ చూస్తూ, "మీది......" అన్నాడు.

"విశాఖపట్టణం"

"ఇప్పుడు అక్కణ్ణుంచేనా రావటం?"

అతను తలూపాడు, ఏదో చెప్దామనుకున్నంతలో.

వివాహమండపం దగ్గరకు వెళ్తోంది రాధ. రాజబాబు పిల్చాడు. రాధ వచ్చింది. "ఇతను మురళి, విశాఖపట్నం, ఇప్పుడే రైలుదిగి వస్తున్నట్టున్నాడు. కాసేపు ఈ మురళిని వాయి(గి)స్తూ ఉండు ఇప్పుడే వస్తా" అని నవ్వుతూ తప్పుకున్నాడు.

రాధ క్షణం అతన్ని చూచింది. మరుక్షణంలో ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి. "ఉండండి! ఇప్పుడే వస్తా" అని వెళ్ళిపోయింది.

తిరిగి వచ్చేసరికి మురళి కొత్తగా చుట్టూ చూస్తున్నాడు. "పదండి!" అందిరాధ ముందు నడుస్తూ, మురళి ఆమె వెనుకగా నడిచాడు.

పెళ్ళి సామాన్లకని కేటాయించిన చిన్న 'స్టోర్' రూంలో కుంటికుర్చీలో కూర్చుని దీర్ఘంగా కళ్ళు మూసుకు ఆలోచిస్తున్నాడు మురళి. "మీరు విశాఖపట్టణంనుంచీ యిదేనా రావటం?" టిఫిన్ ప్లేటు బల్లమీద పెడుతూ, ప్రశ్నించింది రాధ.

మురళి ఒక్క ఉదుటున కళ్ళు తెరిచి, "ఔ..... నం.......డీ!" అన్నాడు తడబడుతూ.

"రాజబాబు మీకు...."

"స్నేహితుడు."

"మీకు నెల్లూరు తెల్సా?"

ఆ ప్రశ్నతో మురళి ఉలిక్కిపడ్డాడు. తలెత్తి ఆమెను చూచాడు, అతనినే గుచ్చిచూస్తోంది. తొందరగా "ఒక గ్లాసు మంచినీళ్ళిస్తారా? అన్నాడు. "అతని ముఖాన చిరుచెమటలు పోశాయి. గ్లాసుతో నీళ్ళు తెచ్చిస్తూ, "నా ప్రశ్నకు జవాబు చెప్పారు కాదు" అంది. కొద్దిగా తేరుకుని, "ఎప్పుడో నా చిన్నవాడు నెల్లూరు వెళ్ళినట్టు గుర్తు" అని ముఖం మరోవేపుకు తిప్పుకున్నాడు. "స్నానం చేదురుగాని లెండి!" అని వెళ్ళిపోయింది రాధ.

మరో పావుగంటకు తిరిగివస్తే అతను అక్కడే నిలబడున్నాడు. రాధ ప్రశ్నార్థకంగా చూచింది. "బట్టలు......" అంటూ గొణిగాడతను. రెండు తువ్వాళ్ళు తీసిచ్చింది. అతను స్నానానికి కదిలాడు.

స్నానంచేసి వచ్చేసరికి అతని బట్టలు పెట్టిన స్థానంలో అవి లేవుకానీ, ఒక గ్లాస్కోపంచ, లాల్చీ కనిపించాయి. అతను చుట్టూ కలయచూచాడు. "అవి వాటిని ఆశ్రయించుకున్న మురికిని వదిలించుకుంటానికి వెళ్ళాయి. ప్రస్తుతానికి ఆ పంచ, లాల్చీ కట్టుకోండి" అంది గుమ్మంప్రక్కగా నిలబడి రాధ. మురళి మౌనంగా వాటిని ధరించి పెళ్ళి పందిట్లో ఒకమూలగా వెళ్ళి నిలబడ్డాడు.

దీపాలు వెలిగించారు. మురళికి కొద్దిదూరంలో నిలబడ్డ రంగనాథంగారు ప్రక్కవాళ్ళతో, "అతనేనండీ! మా రాజబాబు స్నేహితుడు. పేరు మురళి, విశాఖపట్టణం" అని చెప్పుకుపోతున్నారు. మురళి ఉలిక్కిపడ్డాడు. "ఆయ నెవరు? తననిగురించి ఆయనకు అంత బాగా ఎట్లా తెల్సింది? తను వచ్చిన రెండుగంటల్లో పరిచయమైంది యిద్దరే. కనీసం ఆయన్ని చూచినట్లుగూడా లేదే?" అనుకుంటూ ఓరకంట వారిని చూడసాగాడు.

వసారాలో నిలబడి, పందిట్లో మూలగా నిలబడి తండ్రివంక ఓరకంట చూస్తున్న మురళిని పరీక్షగా చూస్తోంది రాధ. ఆసమయంలో అనేకమైన ప్రశ్నలు ఆమెలో తలెత్తాయి. రాజబాబు లోపలికి పోతూ రాధనిచూచి, "నువ్విక్కడున్నావా? తొందరగా బీరువాలోని ఒక కొత్త పంచ, ఉత్తరీయం తియ్, కట్టుకోవాల్ట" అన్నాడు.

పంచకట్టుకుని, ఉత్తరీయం భుజాన వేసుకున్నాడు. రాధ తిలకం తెచ్చి, కల్యాణంబొట్టు దిద్దుతూ, "అన్నయ్యా! ఆయ నెవరు?" అని అడిగింది. "ఎవరాయన?" అంటూ, "ఓ..... ఆయనా! ఇందాక నేను పరిచయం చేసినాయనేనా?" అన్నాడు. "ఉ" అంది రాధ. "ఏమో నాకు తెలియదు" అంటూ ఉత్తరీయం మెడచుట్టూ తిప్పుకోసాగాడు. రాధ ఆశ్చర్యంతో, "ఆయన నీ స్నేహితుడుకాదా?" అంది.

"అట్లాగని ఆయన చెప్పాడా?"

"కాదు. నేనే అడుగుతున్నా."

"నిజంగారాధా! అతనెవరో నాకు తెలియదు. మనిషి చూస్తే, గౌరవ మర్యాద తివ్వతగ్గవాడుగా కనిపించాడు. అలాంటివాణ్ణి నువ్వెవరు? అని ఎలా అడిగేది. ఏం తోచక నీ కప్పగించాను. అతను మన



పొడైనా, కాకపోయినా మనింటికొచ్చాడు కాబట్టి అతనికి ఆతిథ్యమివ్వటం మన ధర్మం'' అన్నాడు.

''అలాగని అర్హతలేనివారికి ఆతిథ్యమిస్తామా?''

''పోనీ రాధా! ఒక్కరోజు మనం అతని కాతిథ్య మిచ్చినందువల్ల అతను ఆకాశాని కంటేదీలేదు, మనం అధోగతికి పోయేదీలేదు. ఈ శుభసమయంలో రాద్ధాంతం చెయ్యకు. అందరితోపాటు అతనికీ అన్నీ సమకూరేట్టు చూడు.''

''అతనూ మన మంచితనం గుర్తించాలిగా....'' అని ఏదో చెప్తుండగానే, ఎవరో రాజబాబును పిల్చారు. అతను వెళ్ళిపోయాడు. రాధ ఆలోచిస్తూ నిలబడింది.

రాత్రి తొమ్మిదిగంటలకు రాజబాబు వివాహం ఘనంగా జరుగుతోంది. మురళి యథాస్థానంలో నిలబడి పెళ్ళి చూస్తున్నాడు. రంగనాథంగారు ఉండుండి మురళినిచూస్తూ, చిరునవ్వు నవ్వుతున్నారు. ఆయన ఒక్కొక్క నవ్వు మురళికి కత్తిపోటులాగా తగుల్తోంది.

''ఏమండోయ్! నెల్లూరునుం చెప్పుడు రావటం?'' అంటూ ఒక వ్యక్తి రంగనాథంగార్ని ప్రశ్నించాడు.

''ఇవాళేనండి! మధ్యాహ్నం వచ్చాం.''

''అమ్మాయీ, వదినగారూ కులాసా?''

''మీ వదిన వంటింట్లో పెత్తనం చేస్తోంది. అమ్మాయి అదిగో'' అంటూ పందిరి స్తంభాన్ని ఆనుకు నిలబడ్డ రాధను చూపించారు. మురళి అటుతిరిగి చూచి, అదిరిపోయాడు. అతని శరీరంలో రక్తం గడ్డకట్టుకుపోసాగింది. వెళ్ళిపోదామని చుట్టూ చూచాడు. కానీ చాలామందికళ్ళు అతనిమీదే కేంద్రీకరించబడున్నాయి.

''మాంగల్యధారణ ముహూర్తే, సుముహూర్తే'' అని పురోహితుడు మంత్రం ఉచ్చరిస్తుండగా, మేళాలన్నీ ఒక్కపెట్టున మోగాయి. చేతుల్లో అక్షింతల్ని వధూవరులమీదకు విసిరి ఆశీర్వదించారు పెద్దలు. మురళి కూడా విసిరి, రాధవంక చూచాడు.

''అయితే మీది విశాఖపట్నమా అబ్బాయ్!'' అన్నారు అతని ప్రక్కగావచ్చి నిలబడ్డ రంగనాథం గారు.

''ఔ......నండి! ''

''పెళ్ళయిందా?''

''లేదు.''

''అమ్మ, నాన్న?''

ఎవరో వచ్చి రంగనాథంగార్ని పిల్చారు. ఆయన చిరాకుగా కదిలి వెళ్ళారు.

రాత్రి భోజనాలు పూర్తయ్యాయి. ''ష్టోర్'' రూంలో అతనికి పక్క అమర్చింది రాధ. పక్కమీద కూర్చున్నాడు మురళి. రాధ చెంబుతో మంచినీళ్ళు తెచ్చి, బల్లమీదపెట్టి వెనుతిరిగింది.

''రాధాదేవిగారూ!'' పిల్చా డతను. ఆమె నిలబడింది.

''ఇలా ఒకసారి వస్తారా? మీతో ఒక విషయం చెప్పాలి.''

రాధ తలవంచుకుని రెండడుగులువేసి నిలబడింది.

''చూడండీ! ఇందాక నేను చెప్పింది అబద్ధం. రాజబాబు నాకు స్నేహితులుకారు. నిజం చెప్పాలంటే ఆయనెవ్వరో నాకు తెలియనే తెలియదు'' అన్నాడు.

''అవును. మీరు మా రాజన్నయ్యకు ఏమీకారు. మీరు వచ్చిందికూడా విశాఖనుంచికాదు, నెల్లూరు

—58వ పేజీ చూడండి

పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నదీ, మీ సరియైన దర్శనముగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీరు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డువ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాత్‌ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల సైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyothishi (W. P.) JULLUNDUR CITY.



అందుకోలేని ఆతిథ్యం

8వ పేజీ తరువాయి

మంచి. అంతేకాదు. మీరు రైల్లో టికెట్ లేకుండా ప్రయాణం చేశారు!"

మురళి ఆశ్చర్యంగా ఆమెను చూచాడు.

"మురళీగారూ! పరిస్థితుల ప్రోద్బలంవల్ల మీ రబద్ధమాడారు కాదనను. కానీ పరిసరాల్లోని వ్యక్తులమనస్తత్వాలు మంచివైనప్పుడు ఆ అబద్ధం వల్ల వారి మనస్సులు నొప్పించినవాళ్ళయ్యారు. కావాలని ఆతిథ్యం కోరితే కాదనేవా ళ్ళిక్కడెవ్వరూలేరు. అది గుర్తిస్తే సంతోషం" అని అక్కణ్నుంచి వెళ్ళిపోయింది.

మురళి ఆలోచిస్తూ కూర్చున్నాడు. అతనికళ్ళకు అస్పష్టమైన దృశ్యం మసగ్గా అగుపించింది.

* * *

అది ఒక పాతకొంప. చుట్టూ దరిద్రదేవత వికటాట్టహాసం చేస్తోంది. మలేరియారోగానికి ఆ స్థలం పుట్టిల్లు. మలేరియా విలయతాండవానికి ఆ యింట్లో అప్పటికి రెండు ప్రాణాలు రాలిపోయాయి. ఇంక మిగిలింది ఒక ఎండుకట్టె, ఒక బండరాయి.

"అమ్మా! అయ్యా!!" మూలుగుతోంది ఓక ఎముకలగూడు. గూట్లో దీపం సత్యాగ్రహం చేస్తానని బెదిరిస్తోంది. మంచానికి రెండడుగుల దూరంలో, మోకాళ్ళల్లో తలదూర్చుకు కూర్చున్నాడు ఒక పదిహేనేళ్ళ బాలుడు. "అమ్మా! అయ్యా!! ...... బాబూ మురళీ!" పిల్చింది అస్థిపంజరం. బాలుడు లేచి మంచం సమీపించాడు.

" బాబూ....నా....జీ....వి....క....ది....లి....పో "

గూట్లో దీపం గుప్పుమంది. మురళి ఎముకలగూడు మీదపడి, "అమ్మా! నువ్వు పోవద్దే....నన్నూ తీసుకుపోవే...." అని ఏడుస్తున్నాడు. గుడిశలో చీకటి కమ్ముకుపోయింది. బాలుడు సొమ్మసిల్లిపోయాడు.

పోలీసుల ఈలలు, మనుష్యుల కేకలు, బ్యాటరీ లైట్ల కాంతితో ఆ ప్రాంతంలోని చీకటిదేవత నల్లనిముసుగు కొంతవరకూ తొలగింది. "ఢబ్" ఏదో వస్తువు గుమ్మంలోనుంచి దొర్లుకువచ్చింది. ఎవరో పరుగెత్తారు. సొమ్మసిల్లిన బాలుడు తేరుకుని ప్రక్కగా వచ్చిపడ్డ ఒక గుండ్రని వస్తువును చీకట్లో తడివిచూడసాగాడు. అది ఒకకారు ట్యూబు. దాన్నిండా నీరులాంటి ఏదో ద్రవం పోయబడుంది.

"రాస్కెల్! ఈ గుడిశలోనే ఉంటాడు వెతకండి!" అందొక గంభీరకంఠం. నాలుగు ఇనుప బూట్లకాళ్ళు లోనికి ప్రవేశించాయి. ఆ కాళ్ళ తాలూకు వ్యక్తుల చేతుల్లోని బ్యాటరీలైట్ల కాంతి ఆ బాలుడిమీదా, ట్యూబుమీదా ప్రసరించబడింది. "వెధవా! మా కళ్ళల్లోనే దుమ్ముకొడతావుకదూ?" అంటూ, బయటకు లాక్కొచ్చారు. వీధివెంబడి

కాంతిలో పోలీసుల్నీ, ఇన్‌స్పెక్టర్నీ చూచి గజగజ వణుకుతూ బావురుమన్నాడు ఆ బాలుడు.

కోర్టులో అంత చిన్నతనంలోనే 'నాటుసారా' వ్యాపారం చేస్తున్నందుకు, ఆ బాలుణ్ణి సక్రమమైన పద్ధతిలో పెట్టేటందుకు, అయిదు సంవత్సరాలు "బాలుర క్రమశిక్షణచెరసాల"కు పంపమని న్యాయాధిపతి తీర్పునిచ్చారు. ఆ సమయంలో అతనికి 'నా' అన్న వాళ్ళెవరూ లేకపోయినా, 'మా' అనబడే ఒక వేలువిడిచిన మేనమామ ఉన్నాడు. అతనూ కోర్టుకు హాజరయ్యాడు. అతని అంతర్థం ఆ బాలుడు జైలుకువెడితే అతని ఇల్లు ఆక్రమించాలని.

* * *

పదిగంటలకు స్నానానికి నూతిదగ్గరకు బయల్దేరిన మురళిని కొన్ని మాటలు నిలిపివేశాయి. "ఏమండీ వదినగారూ! ఈ సంవత్సరం రాధ పెళ్ళి చెయ్యరా?" అందొక గొంతు.

"చెయ్యాలనే ఉంది వదినగారూ! మంచి సంబంధంగూడా చూదాం" అన్నది మరొక గొంతు.

"అరె ఎప్పుడూ? ఎక్కడా?"

"ఇక్కడే! అబ్బాయిపేరు మురళి, విశాఖపట్టణం. అమ్మాయి కూడా ఒప్పుకునేట్టే ఉంది."

"ఆస్తిపాస్తులు"

"ఆ, వాటిదేముంది. మనకుండేదేదో మనకుండనే ఉంది. ఆస్తిపాస్తుల విషయం ఎత్తానంటే మావారు మండిపడతారు. కుర్రాడు బుద్ధిమంతుడు, యోగ్యుడూ అయితే చాలు. ఇవాళో, రేపో వారిచేత అన్నీ మాట్లాడించేస్తాము."

ఇంక వినలేక మురళి గబగబా నూతిదగ్గరకు వెళ్ళిపోయాడు. స్నానం చేస్తున్నంతసేపూ అతన్ని అనేక రకాల ప్రశ్నలు చుట్టుముట్టాయి. "తనెవరు, తన అంతస్తేమిటి, తను రాధకు అర్హుడేనా, తను ఆ ఇంటికి ఏవిధంగా అతిధిగా వచ్చాడో తెలిస్తే వీళ్ళంతా పూర్వంలాగా ఆదరిస్తారా?" మెల్లగా గత స్మృతుల్లోకి జారిపోయాడు.

ఆరోజుతో అయిదు సంవత్సరాలు పూర్తయ్యాయి. జైలునుంచి వచ్చి, "మా" అనబడే మేనమామవద్దకువచ్చి, ఆశ్రయిస్తే, ఒక అయిదు కాగితం, రెండు జతల బట్టలు, తిరిగి గుమ్మం తొక్కద్దన్న తాఖీదు ముట్టాయి.

ఆది మొదలూ వాళ్ళనూ, వాళ్ళనూ ఆశ్రయించేవాడు. ఉన్నచోట నిసుగుపుడితే రైలెక్కేవాడు. ఇదీ అతని చరిత్ర.

మధ్యాహ్నం అంతా విశ్రాంతి తీసుకుంటున్నారు. రాధ క్రితంరోజుతప్ప కనిపించనేలేదు. కుంటి కుర్చీలో కూర్చుని, ఆలోచిస్తున్నాడు మురళి.

గుమ్మంముందు చప్పుడైంది. రాధ అతనిబట్టలు మడతల్లోతెచ్చి బల్లమీదుంచి వెళ్ళిపోయింది. వాటిని చూస్తూ, మురళి ఒక నిర్ణయానికి వచ్చి, "స్టోర్" రూం గుమ్మంముందు నిలబడి చుట్టూ చూచాడు. పందిరిస్తంభాన్ని పట్టుకు గిరగిరా తిరుగుతున్నాడొక కుర్రాడు. మురళి పిల్చాడు. కుర్రాడొచ్చాడు. "నీ పేరు?"

"చంద్రం"

"నాకొక పెన్సిల్‌కావాలి తెచ్చిస్తావా?"

కుర్రాడు నిమిషంలో తెచ్చిచ్చాడు. చుట్టూ వెదికి ఒక తెల్లకాగితం సంపాదించాడు మురళి.

సాయంత్రం కొందరు చల్లగాలికి ఊరిబయటకు షికారు బయల్దేరారు. మురళి పాంటు, షర్టు తొడుక్కుని, విప్పినని మడతల్తో బల్లమీదుంచి ఒక కాగితంమడత వాటిమీదుంచి బయటకు వచ్చాడు. రాధ దూరంగా ఎవర్తోనో మాట్లాడుతోంది. క్షణం ఆమెను చూచి, గబగబా షికారుకు వెళ్ళేజట్టు వెనగ్గా నడవసాగాడు.

మురళి వెళ్ళిన మరో పదిహేను నిమిషాలకు రాధ ఆ రూం కొచ్చింది. క్రితంరోజు మురళి ధరించిన బట్టలు, వాటిమీద ఒక కాగితంమడతా చూచి ఆత్రుతగా కాగితాన్నందుకుంది.

"గౌరవనీయులైన రాజబాబు, రాధాదేవిగార్లకు,

మీ ఆతిథ్యం జన్మలో మరువరానిది. ఈపాటికి రాధాదేవిగారు నా నిజచరిత్ర చాలా గ్రహించి ఉంటారు. ఒకరోజు మీ ఆతిథ్యం అందుకోవటం నా పూర్వపుణ్యఫలం. మీలాంటివారి నీడనైనా తాకే అర్హతలేనివాణ్ణి. నేను మీకు చెప్పిందంతా అబద్ధం. నా చరిత్ర సూక్ష్మంగా ఇందులో పొందుపరుస్తున్నాను......ఆవిధంగా రైలునుంచి దిగిపోయాను. అప్పటికి నాల్గురోజులైంది అన్నంతిని. ఊళ్ళోకి వస్తే ఇక్కడెదో పెళ్ళి జరుగుతుందనితెల్సి, అర్థించటానికి వచ్చాను. రాజబాబుగారికి నా గతచరిత్ర చెప్పాలనుకున్నాను, కాని వారు వినేస్థితిలోలేరు. అందుకే అబద్ధమాడాను. నేను చేసిన ఈపనికి చింతిస్తున్నాను. మీవి పవిత్రమైన హృదయాలు. అందుకే మీ చెంత నిలబడలేకపోయాను. మీ ఆతిథ్యాన్ని సంపూర్తిగా పొందలేకపోయాను. ఇహనుంచి నిజాయితీగా కాలం గడపటానికి ప్రయత్నిస్తాను. ఆ నిజాయితీని కాలం కలిగించనివాడు యేంచేస్తానో......ఇహ వ్రాయలేను.

ఇట్లు,
మురళి"

రాధ ఉత్తరం చదివి, దీర్ఘంగా నిట్టూర్చింది. రాజబాబుకు అప్పటికి కొంత తీరిక చిక్కింది. చకచకా "స్టోర్" రూంలోకివస్తూ, రాధని, ఆమె చేతిలోని కాగితాన్నీచూచి, కాగితాన్నందుకుని గబగబా చదివి, "అరే, ఇదేమిటి? కథలోలాగావచ్చి, కలలోలాగా వెళ్ళిపోయాడు! ఉత్త పిరికివాళ్ళాగున్నాడే?" అంటూ నోరుతెర్చుకు నిలబడిపోయాడు.

* * *

సాయంత్రం ఆరుగంటలకు మద్రాసుపోయే పాసింజరుబండిలో ఒకానొక మూడవతరగతి కిటికీప్రక్కగా కూర్చుని, ఆ చిన్న స్టేషన్నీ, వచ్చేపోయే వాళ్ళనూ చూస్తున్నాడు మురళి. "కూ" మని కూతపెడ్తూ, మద్రాస్వైపుకు సాగింది రైలుబండి. క్రమంగా ఆ స్టేషనూ, దూరంగా కనిపించే గ్రామం మరీ దూరం కాసాగింది. ★

పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
అయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

డాక్టర్ వృత్తి చేయండి!
ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు, పోస్టల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటురిజిస్టర్డు కాలేజీద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము. వివరములకు వెంటనే వ్రాయండి.
INDIAN
HOMOEOPATHIC
COLLEGE
(APW) JULLUNDUR CITY

శ్రీబాలాంజనేయ ప్రశ్న
సంతానము, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలింపబడిన సొమ్ము, విడిపోయినభార్య మొదలగు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలము. రూ 2 ఎం.ఓ. చేయండి. నెలలవారీగా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము రూ 2. పూర్తి పేరు, జాబు వ్రాసిన టైము తెలిపిన చాలును.
హనుమాన్ జ్యోతిషాలయము,
10వ లేను, అరండల్ పేట, గుంటూరు 2.

మంచి పుస్తకాలు
జీవితరహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:- ...... రూ. 3-50
యువతి - స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు. ...... రూ 3-50
సంతానము.- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు. ...... రూ 3-50
ఉమ్మక రహస్యాలు:- వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు. రూ 6-00
ఉద్యోగదర్శిని:- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు. రూ 3-00
ఆత్మజ్ఞానము:- శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50
పోష్టు ఖర్చులు ఉచితం క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి పి పోస్టుద్వారా మీయింటికి పంపబడును
దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర